విశాఖపట్టణం
సోమవారం13 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 79 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఇన్‌స్టాలో అర్ధనగ్న ప్రదర్శనలు

**డబ్బులిస్తే అసభ్య కంటెంట్ సబ్ స్క్రిప్షన్**


**యాంకర్ విష్ణు ప్రియపై ఏఐఎస్ఎఫ్ ఫిర్యాదు**

**అకౌంట్‌ను బ్లాక్ చేయాలని డిమాండ్**

**(విజయవాడ - జయజయహే)**

యాంకర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విష్ణుప్రియ భీమినేని ప్రస్తుతం తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఆమెపై విజయవాడ ..మిగతా 2లో





## మూగబోయిన మధురగానం

**ఆశా భోంస్లే కన్నుమూత**

**బ్రీచ్ కాండీలో చికిత్స పొందుతూ మృతి**

**నేడు శివాజీ పార్కులో అంతక్రియలు**

**సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం**

**(ప్రత్యేక ప్రతినిధి- జయజయహే)**

ప్రముఖ సింగర్ ఆశా భోంస్లే (92) కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు ఆనంద్ భోంస్లే కన్ఫర్మ్ చేశారు. తన తల్లి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్‌లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శనివారం సాయంత్రం గుండెపోటుతో ఆశా భోంస్లే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేర్పించగా... ఎమర్జెన్సీ విభాగంలో చికిత్స అందించారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ పెరిగి ఊపిరి తీసుకోవడం ..మిగతా 2లో

# మహిళలకు ప్రైం వచ్చేసింది

**విమెన్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నాం**

**నిజమైన స్ఫూర్తితో కోటా ఇస్తున్నాం**

**పార్లమెంట్ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని మోడీ లేఖ**





**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అమలుచేసే సమయం వచ్చిందంటూ లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ రాశారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్ కోటా అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియం)తో ముడిపడిన సవరణ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా ఏకం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. విస్తృతమైన చర్చల తర్వాతే ఈ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తేవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. "2029 నుంచి మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వస్తే భారత ప్రజాస్వామిక సంస్థలకు కొత్త బలం లభిస్తుంది. వాటిపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రభుత్వాల పాలనలో ప్రజా భాగస్వామ్యం, ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది. దీనిపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ మొదలుకానుంది. ఇందులో అన్ని పార్టీల ఎంపీలు భాగం కావాలి. కలిసికట్టుగా ముందుకు సాగేందుకు, అందరినీ మనతో కలుపుకు పోయేందుకు పార్లమెంటులో ఏకం అవుదాం. ఈ స్ఫూర్తితోనే నేను మీకు ఈ లేఖను రాస్తున్నాను. ఇప్పటికే మనమంతా అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని చూస్తున్నాం. మహిళలు శ్రమ, నిబద్ధతలతో తమ సామర్థ్యాలను చాటుకుంటున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే అంశం చాలా దశాబ్దాల పాటు చర్చలకే పరిమితమైంది. కానీ ..మిగతా 2లో

# పట్టణ పోరు తర్వాతే పల్లె పోరు..!

**కూటమి సర్కారు సరికొత్త స్కెచ్**

**ప్రజల మూడ్ పై కీలక సర్వే**

**భారీ విజయాలకు క్యాడర్‌కు ఆదేశాలు**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

స్టేట్ ఈసీ చీఫ్ పదవీకాలం ముగిసిపోయింది. కొత్త కమిషనర్ పోస్టింగ్‌కు కూడా కసరత్తు నడుస్తోంది. దీంతో ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీల్లో అధికారుల పాలన నడుస్తోంది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు కూడా ముగిసింది. ఎప్పటినుంచో ఎన్నికలకు ప్రిపరేషన్స్ జరుగుతున్నా..లేటెస్ట్ డెవలప్‌మెంట్స్.. లోకల్ బాడీ పోల్స్‌పై అప్డేట్స్ కమింగ్ సూన్ ..మిగతా 2లో






## మత్స్యగెడ్డలో మునిగిన ముగ్గురు బాలురు

**ఈతకు దిగి ఊబిలో చిక్కుకొని మృతి**

**అల్లూరి జిల్లాలో మరో విషాదం**

3



## బెట్టింగ్‌పై ఉక్కుపాదం

**ఐపీఎల్‌పై ఆన్ లైన్ జూదంపై నిఘా**

**ఆస్తులను అటాచ్ చేస్తాం**

**కఠిన చర్యలు తప్పవు.. డీజీపీ హరీశ్ గుప్తా వెల్లడి**

**(అమరావతి - జయజయహే)**

బెట్టింగ్, జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో జరుగుతున్న బెట్టింగ్, జూద కార్యకలాపాలు పూర్తిగా నిషేధితమని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆదివారం డీజీపీ తన ..మిగతా 2లో

# టీఆర్ఎస్‌గా బీఆర్ఎస్..!

**పేరు మార్పుతో బారీ నష్టం వాటిల్లింది**

**కొత్త ఉత్సాహం నింపాలంటే టీఆర్ఎస్ గానే..**

**వర్కింగ్ ప్రెసిడింట్ కేటీఆర్ వ్యాఖ్యలు**



**(హైదరాబాద్ - జయజయహే)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి 'టీఆర్ఎస్'గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో ..మిగతా 2లో

## రెండు రోజులు తీవ్ర వడగాల్పులు

**51 మండలాల్లో ప్రతాపం.. 49 మండలాల్లో వడగాలులు**

**గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

**వాతావరణ శాఖ అంచనా**



2



## పాడేరు ఘాట్ రోడ్డులో లోయలో పడ్డ బైక్.. ఇద్దరు మృతి

3

## 18 లేదా 19న ఇంటర్ ఫలితాలు

**త్వరలోనే ప్రకటన వెలువడే ఛాన్స్**

3

# పట్టణ పోరు తర్వాతే పల్లె పోరు..!

మొదటి పేజీ తరువాయి...

అన్నట్లుగా మార్చేస్తున్నాయి. స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఎప్పటి నుంచో చర్చ జరుగుతోంది. ఆరు నెలలుగా ఏపీలో లోకల్ ఫైట్‌పై ఇంట్రెస్టింగ్ డిస్కషన్ కొనసాగుతోంది. ఈ ఏడాది స్టార్టింగ్‌లోనే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పెట్టాలని..కూటమి సర్కార్ భావించినట్లు వార్తలు వచ్చాయి. చాలా మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తోంది. ఇక నెలలోనే పంచాయతీల పాలకవర్గాలు గడువు కూడా ముగిసింది. అయితే ఇప్పటికే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలపై ఓ హింట్ ఇచ్చారు. ఆరు నెలల్లోపు లోకల్ పోల్స్ నిర్వహిస్తామని..రెడీగా ఉండాలని..మంత్రులు, కూటమి క్యాడర్‌కు ఇండికేషన్ ఇచ్చారు. ఇంతలోనే ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ పదవీకాలం ముగిసింది. కొత్త ఎన్నికల కమిషనర్‌ను నియమించేందుకు కసరత్తు చేస్తోంది కూటమి సర్కార్. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలపై మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికలకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఏపీలో రెండేళ్ల క్రితం సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీని చిత్తు చేసి మరీ 95 శాతం స్ట్రైక్ రేటుతో బంపర్ సక్సెస్ కొట్టిన టీడీపీ, కూటమికి..ఈ మధ్యకాలంలో ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు ఏ రకమైన అవకాశం రాలేదు. అయితే ఇప్పుడు అటువంటి సందర్భం రాబోతోందని అంటున్నారు. ఏపీలో లోకల్ బాడీలకు ఎన్నికలు పెట్టేందుకు సర్కార్ రెడీ అవుతోంది.




మార్చిలోనే మున్సిపాలిటీలు అలాగే కార్పొరేషన్ల పదవీ కాలం పూర్తి అయిపోయింది. ఏప్రిల్ 2నే గ్రామ పంచాయతీల పదవీ కాలం కంప్లీట్ అయింది. జూన్‌లో జిల్లా మండల పరిషత్తుల పదవీకాలం కూడా ముగియనుంది. దాంతో ఎన్నికలు నిర్వహించేందుకు కూటమి ఒక పక్కా ప్లాన్‌తో వెళ్తోంది. ముందుగా పట్టణాలలోనే జనం పల్స్ తెలుసుకోబోతోందట. మొదటి నుంచి టీడీపీకి అర్బన్ ఏరియాలో మంచి పట్టు ఉంది. వైసీపీ పుట్టిన నాటి నుంచి రూరల్ బేస్‌లోనే బలం పెంచుకుంటూ వస్తోంది. దీంతో స్థానిక ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ విక్టరీని కొడతామని గట్టిగా చెప్పుకుంటున్న టీడీపీ కూటమి మున్సిపల్ పోరుతోనే విజయ యాత్ర స్టార్ట్ చేయాలని భావిస్తోందట. లోకల్ బాడీ ఎలక్షన్స్‌పై ఇప్పటికే క్యాబినెట్‌లో చరించారని అంటున్నారు. మంత్రుల అభిప్రాయాలను తెలుసుకున్న సీఎం చంద్రబాబు..త్వరలోనే ఎన్నికలకు వెళ్లాలని ఒక అభిప్రాయానికి వచ్చారట. దాంతో పాటు ముందుగా పదవీకాలం పూర్తి అయింది కాబట్టి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నుంచే ఎన్నికల నగారా మోగించాలని చూస్తున్నారట. వందకు పైగా మున్సిపాలిటీలు..దాదాపు డజన్‌కి పైగా కార్పొరేషన్లలో ముందుగా ఎన్నికలు పెట్టి..సత్తా చాటాలనేది కూటమి సర్కార్ ప్లాన్ అని చెబుతున్నారు.

### భారీ విజయాలు నమోదు చేయాలని ఆదేశం..

ఆగస్ట్ వరకు పురపోరును కంప్లీట్ చేయాలని ప్రభుత్వం ఫిక్స్ అయిందని అంటున్నారు. అప్పటిలోగా బీసీ రిజర్వేషన్ల లెక్క తేల్చాలని భావిస్తున్నారట. ఇక మున్సిపల్ ఎన్నికల్లో భారీ విజయాలను నమోదు చేయాలని ఇప్పటి నుంచే జనాల్లో ఉండాలని చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నికలు వస్తున్నాయి సిద్ధం అయిపోవాల్సిందేనని చంద్రబాబు చెప్పేశారు. మొత్తం మీద చూస్తే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేటును సాధించి..అదే ఊపులో మండల, జిల్లా పరిషత్‌లు, తర్వాత పంచాయతీలకు ఎన్నికలు పెట్టాలనేది కూటమి ప్రభుత్వం ఆలోచనగా తెలుస్తోంది.



# ఇన్‌స్టాలో అర్ధనగ్న ప్రదర్శనలు

మొదటి పేజీ తరువాయి...

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఇప్పుడు టాలీవుడ్, సోషల్ మీడియా వర్గాల్లో సంచలనంగా మారింది. బిగ్ బాస్ వంటి పాపులర్ రియాలిటీ షోల ద్వారా మంచి క్రేజ్ సంపాదించుకున్న ఒక సెలబ్రిటీపై ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశమైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అర్ధనగ్న వీడియో చూడాలంటే నగదు చెల్లించి సబ్ స్క్రైబ్ చేసుకోవాలంటూ ప్రచారం చేసుకుంటున్న యాంకర్ విష్ణుప్రియ భీమినేనిపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. పలు షోల్లో అందరినీ నవ్వించే విష్ణుప్రియ కాసులకు కక్కుర్తి పడి అర్ధనగ్న వీడియోలు చేస్తున్నారని విమర్శించారు. ఇతరులకు ఆదర్శంగా నిలవాలి కానీ ఇలా ప్రకటనలు చేసి సమాజానికి ఏం సందేశం ఇస్తోందని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రశ్నించారు. వెంటనే విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. క్రిమినల్ కేసు నమోదు చేయాలిని అన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు దీపక్, సిద్దు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా ఉండాల్సిన విష్ణుప్రియ డబ్బు కోసం అశ్లీలతను ప్రోత్సహించడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అర్ధనగ్న వీడియోలు చూడాలంటే రూ.399 చెల్లించి సబ్ స్క్రైబ్ చేసుకోవాలని ఆమె ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యువతను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను బ్లాక్ చేసి, ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, తదితరులు ఏసీపీ భానును కలిసి ఫిర్యాదు చేశారు.

# బెట్టింగ్‌పై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...

కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ నేపథ్యంలో ఏపీవ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్, జూద కార్యకలాపాల నిరోధంపై జీరో టాలరెన్స్ విధానంతో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై దాడులు ముమ్మరం చేశామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా ఉన్న పలు క్లబ్‌లను మూసివేశామని చెప్పుకొచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను గుర్తించామని అన్నారు. సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బ్లాక్ చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బుకీలు, ఏజెంట్లు, బెట్టింగ్‌లో పాల్గొనే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి బీఎన్ఎస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఇప్పటికే గుర్తించి ఫ్రీజ్ చేస్తున్నామని అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తూ పదే పదే గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నేరస్తులపై ప్రివెంటివ్ డిటెన్షన్, చర్యలు తీసుకోవాలని పోలీసులకు డీజీపీ ఆదేశించారు. బెట్టింగ్ ద్వారా సంపాదించిన, ఉపయోగిస్తున్న ఆస్తులను గుర్తించి చట్ట ప్రకారం అటాచ్ చేస్తామని తెలిపారు. ఐపీఎల్ సందర్భంగా ఏపీ వ్యాప్తంగా లాడ్జీలు, హోటళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయని వివరించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై నిరంతర నిఘా పెట్టామని చెప్పారు. యువతకు బెట్టింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. బెట్టింగ్, జూదాలకు ప్రజలు దూరంగా ఉండాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా విజ్ఞప్తి చేశారు.

# మహిళలకు టైం వచ్చేసింది

మొదటి పేజీ తరువాయి...

మేం 2023లోనే దానిపై చట్టం చేశాం. ఆ చట్టం ఆమోదాన్ని పొందిన రోజు, భారత దేశ పార్లమెంటరీ ప్రస్థానంలో స్ఫూర్తిదాయక మైలురాయిగా నిలిచిపోతుంది. యావత్ ప్రపంచం ఆ ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా మా ప్రభుత్వమే ముందడుగు వేసింది. ఇప్పుడు త్వరితగతిన ఆ చట్టాన్ని అమల్లోకి తేవడంపై ఫోకస్ పెట్టాం. దీనితో ముడిపడిన రాజ్యాంగ వ్యవహారాలపై ఇప్పటికే నిపుణులు, రాజకీయ నేతలతో చర్చించాం. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలి. చారిత్రక మార్పుకు నాంది పలకాలి" అని లేఖలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసం పార్లమెంటు బడ్జెట్ సెషన్‌ను కేంద్ర ప్రభుత్వం 3 రోజుల పాటు పొడిగించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలంటూ లోక్‌సభ, రాజ్యసభలలోని తమ ఎంపీలకు బీజేపీ ఆదివారం రోజు త్రీ లైన్ విప్‌ను జారీ చేసింది. మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్ ముగిసే వరకు సభల్లో అందుబాటులో ఉండాలని నిర్దేశించింది. ఆ 3 రోజుల వ్యవధిలో ఎలాంటి సెలవులూ తీసుకోవద్దని సూచించింది. పార్టీ ఎంపీలంతా విప్‌ను కచ్చితంగా పాటించాలని, తప్పకుండా సభలకు హాజరై సహకరించాలని బీజేపీ కోరింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసమే బీజేపీ ఈ ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని మోదీ లేఖ రాసింది కూడా ఇందుకోసమే.



# మూగబోయిన మధురగానం

మొదటి పేజీ తరువాయి...

కష్టంగా మారి పరిస్థితి విషమించడంతో ఆమె కన్నుమూశారు. ఆశా భోంస్లే మృతి పట్ల బాలీవుడ్ ఇండస్ట్రీతో పాటు సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సహా మమతా బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, ఎన్టీఆర్ తదితరులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 'ఆశా భోంస్లే మరణ వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యా. దశాబ్దాల పాటు సాగిన ఆమె సినీ ప్రస్థానం... ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి.' అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.


'ఆశా భోంస్లే మరణ వార్త విని తీవ్రంగా దుఃఖిస్తున్నా. ఆమె మధుర స్వరం దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు ప్రాణంగా నిలిచి, లక్షలాది హృదయాలను తాకింది. తరతరాలు నిలిచిపోయే జ్ఞాపకాలను ఆమె వదిలివెళ్లారు. ప్రేమ, గౌరవంతో ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉంటాం. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఓం శాంతి.' అంటూ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. తరతరాలుగా తన పాటతో ఎంతోమందిని మంత్ర ముగ్ధులను చేసిన గాయని ఆశా భోంస్లే అని అన్నారు మమతా బెనర్జీ. ఆమె మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసినట్లు చెప్పారు. మొత్తం సంగీత పరిశ్రమకు తన సానుభూతి తెలియజేశారు. సంగీత ప్రపంచంలో ఓ గొప్ప కంఠం ఈ రోజు మూగబోయిందని అన్నారు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే.



# టీఆర్ఎస్‌గా బీఆర్ఎస్..!

మొదటి పేజీ తరువాయి...

కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రంలోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..




# రెండు రోజులు తీవ్ర వడగాల్పులు

**51 మండలాల్లో ప్రతాపం**

**49 మండలాల్లో వడగాలులు**

**గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

**వాతావరణ శాఖ అంచనా**

**(అమరావతి - జయజయహే)**

ఈ సోమవారం 51 మండలాల్లో తీవ్రవడగాలులు, 49 మండలాల్లో వడగాలులు, మంగళవారం 53 మండలాల్లో తీవ్రవడగాలులు, 57 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాల్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సోమవారం శ్రీకాకుళం జిల్లాలో 9 మండలాల్లో, విజయనగరం జిల్లాలో 18 మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లాలో 15, అల్లూరి జిల్లాలో 1, పోలవరంలో 3, అనకాపల్లిలో 3, ఏలూరులో 2 మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 2, విజయనగరం జిల్లాలో 5, అల్లూరి జిల్లాలో 4 , పోలవరం 9, అనకాపల్లి 5, కాకినాడ 5, తూర్పుగోదావరి 9, ఏలూరు 4, ఎన్టీఆర్ 3, పల్నాడు 2, నంద్యాల 1 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఆదివారం కడప జిల్లా పొట్టిపాడులో 43.8 డిగ్రీలు తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీలు, నంద్యాలలో 42.9 డిగ్రీలు, అనంతపురం జిల్లా తెరన్నపల్లెలో 42.3 డిగ్రీలు, కర్నూలు జిల్లా గూడూరులో42.1 డిగ్రీలు పల్నాడు జిల్లా దుర్గిలో 41.8 డిగ్రీలు శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 41.6 డిగ్రీలు, మార్కాపురం జిల్లా అనుమలపల్లి, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 41.2 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లాలో పోడూరులో 41.1డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు మధ్యాహ్నం వేళ బయటకు రాకుండా ఉండటం మంచిదన్నారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు.అదే విధంగా కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'మలబార్' చేయూత: మంత్రి కందుల దుర్గేష్







### ఏపీలో 2,800 మంది విద్యార్థులకు రూ. 2.52 కోట్ల స్కాలర్‌షిప్‌ల పంపిణీ

### విద్యే సామాజిక మార్పుకు అసలైన మార్గం: మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పట్టుదలతో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం సమాజానికి ఎంతో అవసరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని త్యాగరాజు నారాయణదాసు సేవా సమితి ప్రాంగణంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు చెక్కులను అందజేశారు.

**కార్పొరేట్ బాధ్యత అభినందనీయం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే సహకారంతో పాటు మలబార్ జ్యువెలరీ వంటి కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతగా విద్యార్థులకు అండగా నిలవడం హర్షణీయమన్నారు. "విద్యే భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి, ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి" అని ఆయన ఆకాంక్షించారు.

**ఏపీలో రూ. 2.52 కోట్ల సాయం: ఎం.పి. అహమ్మద్**

ఈ కార్యక్రమం సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ తన సందేశాన్ని విడుదల చేస్తూ, సమాజంలో శాశ్వత మార్పు విద్యతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

భారీ విరాళం: ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది 2,800 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 2.52 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం.

బాలికల విద్యకు ప్రాధాన్యత: దేశ భవిష్యత్తు బాలికల విద్యపైనే ఆధారపడి ఉందని నమ్మి, జాతీయ స్థాయిలో ఇప్పటివరకు లక్షకు పైగా విద్యార్థినులకు అండగా నిలిచాం.

భవిష్యత్తు ప్రణాళిక: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను విద్య, ఆరోగ్యం, ఆకలి నిర్మూలన వంటి సేవా కార్యక్రమాల కోసం రూ. 200 కోట్లు వెచ్చించబోతున్నాం.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఆర్థిక వెనుకబాటుతనం చదువుకు అడ్డంకి కాకూడదని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో మలబార్ జ్యువెలరీ ప్రతినిధులు, లబ్ధి పొందిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమకు అందిన ఈ సహాయం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి, మలబార్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



## భారీగా గంజాయి స్వాధీనం- ఇద్దరు అరెస్ట్

**కొయ్యూరు : (జయ జయహే) న్యూస్ ఏప్రిల్ 12**

అల్లూరి జిల్లా, కోయ్యూరు లో గంజాయి అక్రమ రవాణాపై కోయ్యూరు పోలీసులు భారీ దాడి నిర్వహించి గంజాయి స్మగ్లింగ్‌ను అడ్డుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా,ఇంకా కొందరు నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, 11 ఏప్రిల్ 2026న విశ్వసనీయ సమాచారం మేరకు కోయ్యూరు ఎస్ఐ పి. కిశోర్ వర్మ తన సిబ్బందితో కలిసి చీడిపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో భూధరాళ్ల వైపు నుంచి వచ్చిన ఒక ఆటోను పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు పారిపోవడానికి యత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆటోను అదుపులోకి తీసుకుని ఇద్దరిని పట్టుకున్నారు. తనిఖీ చేయగా ఆటోలో ప్రత్యేకంగా తయారు చేసిన అరలలో దాచిన 32 ప్యాకెట్ల గంజాయి (మొత్తం బరువు 69.600 కిలోలు) బయటపడ్డాయి. పోలీసులు గంజాయి, ఆటో, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారు తాళే కొటిబాబు (ఒడిశా), పడియామి బచేల్ (ఒడిశా). పోలీసుల విచారణలో ఈ గంజాయి ఒడిశా రాష్ట్రం నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్ నుండి తమిళనాడుకు తరలిస్తున్నట్లు బయటపడింది. ఈ ఘటనపై కోయ్యూరు పోలీసులు చీణూరా చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

పట్టుబడిన గంజాయి 69.6కేజీలు

విలువ -34 లక్షల 80 వేలు రూపాయలు ఉన్నట్లు తెలిపారు.

ప్రజలకు హెచ్చరిక:

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కావాలి

**వడ్లపూడి (జయ జయహే)**

వడ్లపూడి మండలం ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమం వడ్లపూడి సిడబ్ల్యూసి కమ్యూనిటీ హాల్లో మండల అధ్యక్షులు అశోక్ చేబ్రోలు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు పరశురాం రాజు పాల్గొన్నారు. వక్తలుగా విజయ్ బాబు , రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్)జిల్లా కార్యదర్శి సోంబాబు ,వెన్నా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. ప్రదాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు వికసిత్ భారత్ లక్ష్యంగా పని చేస్తున్న మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దామా సుబ్బారావు,మండల కమిటీ సభ్యులు కరణం వెంకటరావు , సురేష్ ,రూపాదేవి ,వాసు ,సంజీవరావు , శ్రీనివాసరావు ,కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం మరియు చట్టసభల్లో సముచిత వాటా కోసం బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎలకల నూకలమ్మ పిలుపునిచ్చారు. రాజమండ్రిలో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం మీడియా సమావేశంలో ఆమె ప్రసంగించారు.

**బీసీల రథసారథి ఆర్.కృష్ణయ్య**

దశాబ్దాలుగా బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆర్.కృష్ణయ్య గారి నాయకత్వంలో సంఘం బలోపేతం అవుతుందని నూకలమ్మ పేర్కొన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల వాటా కోసం రాష్ట్ర అధ్యక్షులు వై.ఎన్. ఐసయ్య యాదవ్ నేతృత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు వివరించారు. ఈ పోరాటంలో యువత మరియు మహిళలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు.



**మండపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా వాసంశెట్టి వెంకటరమణ**

ఈ సమావేశంలో భాగంగా మండపేట నియోజకవర్గానికి చెందిన వాసంశెట్టి వెంకటరమణను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. రాష్ట్ర అధ్యక్షులు ఐసయ్య యాదవ్ సమక్షంలో ఆయనకు సంఘం కండువా కప్పి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూకలమ్మ మాట్లాడుతూ, వచ్చే నెల రోజుల్లో మండపేట నియోజకవర్గంలో వెయ్యి మందితో భారీ బహిరంగ సభను నిర్వహించి బీసీల శక్తిని చాటుతామని ప్రకటించారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు**

ఈ మీడియా సమావేశంలో సీనియర్ బీసీ నాయకులు కేకే సంజీవరావు, దాడిశెట్టి వేమన్న, సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, కాకినాడ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, రాజమండ్రి నాయకులు రాజనాల సత్యబాబు తదితరులు పాల్గొన్నారు. బీసీల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు.



## యనమలను పరామర్శించిన రాజ్యసభ సభ్యుడు సానా

**అమరావతి/ ఏప్రిల్ 12, (జయ జయహే)**

మాజీ ఆర్థిక మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆదివారం పరామర్శించారు.ఇటీవల అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన యనమల రామకృష్ణుడు వైద్యుల సూచన మేరకు స్టెంట్ వేయించుకున్నారు.శస్త్రచికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్న ఆయనను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన సానా సతీష్ బాబు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అందుతున్న వైద్య సేవలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.

## మత్స్యగెడ్డలో మునిగిన ముగ్గురు బాలురు

### ఈతకు దిగి ఊబిలో చిక్కుకొని మృతి

### అల్లూరి జిల్లాలో మరో విషాదం

**(అల్లూరి జిల్లా - జయజయహే)**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పాడేరు మండలం పెదబయలు పరిధిలోని పర్రెడ గ్రామంలో ఈతకు వెళ్లిన ముగ్గురు బాలురు ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారం ప్రకారం, గ్రామానికి సమీపంలోని మత్స్య గెడ్డలో ఈత కొట్టేందుకు వెళ్లిన కోడా ప్రదీప్ (9), పాంగి శ్రీను (10), జలంగి హర్షిత్ (10) లోతైన ఊబిలో చిక్కుకుని మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈత సరదాగా వెళ్లిన పిల్లలు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు.

## పాడేరు ఘాట్ రోడ్డులో లోయలో పడ్డ బైక్.. ఇద్దరు మృతి

**పాడేరు, ఏప్రిల్ 12, జయ జయహే :**

అల్లూరి జిల్లా పాడేరు మండలం బంట్రోతుపుట్టు ఘాటు రోడ్డులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో ఇద్దరు మృతిచెందగా , మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులు సుమిత్ర(25) తనుజరాణి (3)గా గుర్తించారు. గాయాలపాలైన చిన్నారి మానస (2) అపస్మారక స్థితిలోకి చేరుకొగా చికిత్స నిమిత్తం పాడేరు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. మరో వ్యక్తి రామకృష్ణకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




## 18 లేదా 19న ఇంటర్ ఫలితాలు

### త్వరలోనే ప్రకటన వెలువడే ఛాన్స్

**(అమరావతి - జయజయహే)**

తెలంగాణలో ఇంటర్ ఫలితాల సందడి మొదలవడంతో, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంటర్మీడియట్ విద్యార్థుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఏపీ ఇంటర్ ఫలితాలు ఎప్పుడు విడుదలవుతాయి అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఏపీలో ఇంటర్ రిజల్ట్స్ తేదీపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వాల్యుయేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, ప్రస్తుతం ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 16వ తేదీ నాటికి ఇంటర్ ఫలితాల విడులకు సంబంధించిన ప్రక్రియ మొత్తం ముగిసే అవకాశం ఉందని సమాచారం. ఏపీ ఇంటర్ బోర్డు ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను ఈ నెల 18 లేదా 19 తేదీల్లో విడుదల చేసే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుండి మార్చి 23 వరకు దాదాపు నెలరోజులపాటు ఏపీలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించి కొన్ని సంస్కరణలు అమలు చేయడం వల్ల పేపర్ల వాల్యుయేషన్‌కు కొంత ఎక్కువ సమయం పట్టిందని, అందుకే ఫలితాలు విడుదల ఇంకా జరగలేదని తెలుస్తోంది. ఒకట్రెండు రెండు రోజుల్లో ఇంటర్ ఫలితాల విడుదలపై ఇంటర్ బోర్డు గానీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గానీ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

For a pure tomorrow..
జయహే




### ఐదేళ్లు భోగాపురాన్ని వదిలేసి

# ఇప్పుడు మేమే చేశామంటారా!

## వైసీపీపై నిప్పులు చెరిగిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 12, జయ జయహే**

అధికారంలో ఉండగా భోగాపురాన్ని ఐదేళ్లు వదిలేసి రోడ్లు కూడా వెయ్యలేని వైసీపీ నాయకులు ఇప్పుడు భోగాపురం మేమే తెచ్చామంటున్నారని చెప్పడం సిగ్గు చేటని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పరుశు రామరాజు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారి శక్తి వందనం అధినియం పేరిట మహిళలకు చట్ట సభ లో ప్రాధాన్యత ఇచ్చే బిల్ ప్రవేశ పెడతామని వెల్లడించారు. ఈ నెల 17 , 18 తేదీల్లో పార్లమెంట్ లో చర్చ జరుపుతారని, దేశంలో ఏభై శాతం మహిళలు ఉన్నా, కేవలం 13 శాతం మాత్రమే చట్ట సభ ల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. స్టాండ్ అప్ ఇండియా , స్టార్ట్ అప్ ఇండియా లో లక్ష కు పైగా అకౌంట్లు మహిళలు సాధించారని గుర్తు చేశారు. మహిళా సాధికారణ అంటే మాటల్లోనే కాదు చేతల్లో చూపించాలని ఎన్ డి ఏ కూటమి అనుకుంటోందన్నారు. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఆయ రిజర్వేషన్లను వచ్చే ఎన్నికల నుంచే అమలు జరపాలని ముందుకు సాగుతున్నామని చెప్పారు. అయితే ఇప్పుడు ప్రజలు తిరస్కరించిన వ్యక్తులు మాట్లాడుతున్నారని, వంద సీట్లు దాటలేని కాంగ్రెస్ కూడా ఈ బిల్లుపై మాట్లాడడం దారుణమన్నారు. ఇక రాష్ట్రంలో గూగుల్, ఆర్సీలార్ మిట్టల్ తెచ్చింది తామే అని వైసీపీ నేతలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెస్ట్ బెంగాల్ ఖరగ్ పూర్‌లో పవన్ కళ్యాణ్ ప్రచారం కోసం రావాలన్న డిమాండ్ ఉందని, ఎన్నికలు జరుగుచున్న ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట కూటమి అగ్ర నాయకులు ప్రచారం చేస్తారని ఈ సారి బెంగాల్‌లో మమతని, తమిళనాడులో స్టాలిన్‌ను మార్పు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభ పక్ష నేత పి విష్ణుకుమార్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు సిహెచ్ పట్టాభి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి యు సుజాత రాజ్, బిజెపి మహిళ అధ్యక్షురాలు ఎన్ జ్యోతి, టిడిపి మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

# విషపు కోరల్లో మామిడి పండ్లు!

### నిషేధిత రసాయనాలతో పండ్ల రారాజుపై మాఫియా పంజా

### అధిక లాభాల కోసం ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్న వ్యాపారులు..

### నిషేధిత కార్బైడ్, అధిక ఇథిలిన్‌తో రాత్రికి రాత్రే మామిడి పండ్ల పక్వం



వేసవి వచ్చిందంటే చాలు.. నోరూరించే మామిడి పండ్ల కోసం చిన్నా పెద్దా తేడా లేకుండా ఎదురుచూస్తుంటారు. ప్రకృతి ప్రసాదించిన ఈ మధురమైన ఫలం ఇప్పుడు రసాయనాల కోరల్లో చిక్కుకుంది.

పండు రంగు చూసి మురిసిపోతే.. లోపల దాగి ఉన్న విషం ప్రాణాల మీదకు తెస్తోంది. నిషేధిత కార్బైడ్ దందా యథేచ్ఛగా సాగుతుండగా, సురక్షితం అని చెప్పే ఇథిలిన్ వాడకంలోనూ అక్రమాలు అలుముకుంటున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం సామాన్యుడి పాలిట శాపంగా మారుతోంది.

**నిషేధిత 'కార్బైడ్'.. మృత్యువుకు షార్ట్‌కట్ !**

మామిడి సహజంగా పండటానికి 10 నుండి 12 రోజుల సమయం పడుతుంది. కానీ, మార్కెట్ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు వ్యాపారులు కాల్షియం కార్బైడ్ అనే ప్రమాదకర రసాయనాన్ని ఆశ్రయిస్తున్నారు.

మోసం ఇలా : పచ్చి కాయల మధ్య కార్బైడ్ పొట్లాలు ఉంచితే, అది విడుదల చేసే ఎసిటిలిన్ గ్యాస్ ద్వారా కేవలం 24 గంటల్లోనే కాయ పసుపు రంగులోకి మారుతుంది.

గుర్తించడం ఎలా? : బయట చూడటానికి ఆకర్షణీయమైన పసుపు రంగులో ఉన్నా, లోపల మాత్రం గుజ్జు పచ్చిగా, పుల్లగా ఉంటుంది. సహజమైన సువాసన అసలే ఉండదు.



ఆరోగ్యానికి ముప్పు : కార్బైడ్ వినియోగం వల్ల తలనొప్పి, వాంతులు, అలసట నుంచి మొదలై.. దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి తగ్గడం, నాడీ వ్యవస్థ దెబ్బతినడం మరియు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది.

**ఇథిలిన్ ముసుగులో మరో దోపిడీ!**

కార్బైడ్ నిషేధం నేపథ్యంలో ప్రభుత్వం 'ఇథిలిన్ రైపెనింగ్ చాంబర్ల'ను ప్రోత్సహించింది. కానీ ఇక్కడే అసలు కథ మారుతోంది.

చాంబర్లలో నిర్ణీత ఉష్ణోగ్రత

ఉష్ణోగ్రత: 18--24ళీజ

తేమ: 90--95%

ఇథిలిన్ మోతాదు: 100 పి పి యం పాటించాలి.

కానీ నిర్వహణ ఖర్చు తగ్గించుకోవడానికి వ్యాపారులు నాణ్యత లేని కెమికల్స్ వాడటం, అతి తక్కువ సమయంలో పండించేందుకు మోతాదుకు మించి గ్యాస్ నింపడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా 'సురక్షితం' అనుకున్న పండు కూడా విషతుల్యమవుతోంది.

**లాభాలే పరమావధి.. నిబంధనలు బేఖాతరు !**

ప్రభుత్వం సూచించిన శాస్త్రీయ పద్ధతులు ఉన్నప్పటికీ అమలు ఎందుకు కావడం లేదంటే సమాధానం ఒక్కటే.. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే ఆశ .

ఎథిఫోన్ స్ప్రే: నీటిలో కలిపి పండ్లపై చల్లడం ద్వారా త్వరగా పండుతాయి. అయితే మోతాదు దాటితే ఇది కూడా ప్రమాదకరమే.

సహజ పద్ధతులు: గడ్డి, వేపాకులు, పేపర్లలో ఉంచి పండించడం సురక్షితం. కానీ దీనికి సమయం పట్టడం, పండ్లు దెబ్బతినే అవకాశం ఉండటంతో వ్యాపారులు వీటిని పట్టించుకోవడం లేదు.

**అధికారుల నిర్లక్ష్యం.. ఎవరికి లాభం?**

పండ్ల మార్కెట్లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు కేవలం మొక్కుబడి వ్యవహారంగా మారాయన్న విమర్శలు వస్తున్నాయి. నిషేధిత కార్బైడ్ యథేచ్ఛగా మార్కెట్లోకి ఎలా వస్తోంది? రైపెనింగ్ చాంబర్లలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని చూసే నాథుడెవరు? కేవలం నమూనాలు సేకరించి చేతులు దులుపుకోవడం వల్ల ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారుతోంది.

**వినియోగదారులకు సూచనలు : వీటిని గమనించండి!**

రంగు : పండు మొత్తం ఒకే రంగులో అంటే ముదురు పసుపు మెరిసిపోతుంటే అది కార్బైడ్ అయ్యే అవకాశం ఉంది.

సహజంగా పండిన పండు అక్కడక్కడా ఆకుపచ్చ ఛాయలతో ఉంటుంది.

స్పర్శ : బయట మెత్తగా ఉండి, నొక్కినప్పుడు లోపల గట్టిగా ఉంటే అది కృత్రిమంగా పండించినట్టే.

రుచి: పండు తిన్నప్పుడు నోరు కాలినట్లు అనిపించినా, వింత రుచి వచ్చినా అది ప్రమాదకరం.

ముందు జాగ్రత్త అవసరం : పండ్లను తినే ముందు కనీసం 15-20 నిమిషాల పాటు ఉప్పు నీటిలో నానబెట్టి, బాగా కడిగి వాడుకోవడం ఉత్తమం.

మామిడి పండు మన సంస్కృతిలో, వేసవి జ్ఞాపకాల్లో ఒక భాగం. కాసుల వేటలో పడి ఆ మధుర ఫలాన్ని 'విష గుళిక'గా మార్చడం క్షమించరాని నేరం. ప్రభుత్వం ఇప్పటికైనా కఠిన చర్యలు చేపట్టి, మార్కెట్లలో నిరంతర నిఘా ఉంచాలి. లేకపోతే రేపటి తరం ప్రకృతి ఇచ్చే తియ్యందనానికి బదులు, రసాయనాల రోగాలనే రుచి చూడాల్సి వస్తుంది!

జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు



# తెలుగు సాహిత్యాన్ని మేల్కొలిపిన మహాకవి శ్రీశ్రీ

**(సి.హెచ్.ప్రతాప్)**

**తెలుగు సాహిత్యంలో శ్రీరంగం శ్రీనివాసరావు రచనలు విప్లవాత్మక మార్పుకు నాంది పలికిన మహత్తర సృజనలుగా నిలిచాయి. ఆయన అసలు పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. "శ్రీశ్రీ" అనే కలంపేరుతో తెలుగు పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. సంప్రదాయ భావకవిత్వం నుంచి సమాజ వాస్తవాల వైపు తెలుగు కవిత్వాన్ని మలిచిన మహాకవి ఆయనే. ఆయన రచనల్లో మనిషి జీవితం, కూలీల కష్టం, సామాజిక అసమానతలు, దోపిడీ, శ్రమజీవుల గౌరవం ప్రధానాంశాలుగా కనిపిస్తాయి.**



ఆయన రచనలలో అత్యంత ప్రసిద్ధి చెందినది "మహాప్రస్థానం". మహాప్రస్థానం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా భావించబడుతుంది. ఇందులోని ప్రతి కవితలో కొత్త ఆలోచన, సామాజిక చైతన్యం, విప్లవ భావజాలం ప్రతిధ్వనిస్తుంది. పేదల బాధలు, కార్మికుల జీవిత పోరాటం, సమాజంలోని వర్గ విభేదాలు వంటి అంశాలను ఆయన ఎంతో బలంగా వ్యక్తపరిచారు. అందుకే ఈ రచనలు కేవలం కవితలుగా కాకుండా ఒక ఉద్యమ స్వరంగా నిలిచాయి.

శ్రీశ్రీ శైలి పూర్తిగా వినూత్నమైనది. సంప్రదాయ ఛందస్సులకు పరిమితం కాకుండా స్వేచ్ఛా వృత్తం, సూటి భావవ్యక్తీకరణ, ప్రజల మాటల శైలి ఆయన రచనల ప్రధాన లక్షణాలు. అలంకారాల కంటే భావానికి, భావోద్వేగానికి, సామాజిక సందేశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణ మనిషి జీవితాన్ని కవిత్వంలోకి తీసుకువచ్చి, కవితను ప్రజల పోరాటానికి ఆయుధంగా మార్చారు. అందువల్ల ఆయన శైలిలో ఉత్సాహం, తిరుగుబాటు స్వరం, మానవతా దృక్పథం స్పష్టంగా కనిపిస్తాయి.

ఆయన భాష చాలా సరళంగా, స్పష్టంగా, సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉంటుంది. అప్పటి వరకు ఉన్న అలంకారభరితమైన కవితా శైలికి భిన్నంగా, నేరుగా హృదయాన్ని తాకే మాటలను ఉపయోగించారు. ఈ శైలి వల్ల యువతలో కొత్త ఉత్సాహం, సామాజిక బాధ్యతా భావం పెరిగింది. దేశం అంటే కేవలం నేల కాదు, మనుషుల సమాహారమనే భావాన్ని ఆయన రచనలు బలంగా తెలియజేస్తాయి.

శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు, కథారచయిత, నాటకకర్త, సినీ గేయరచయిత కూడా. తెలుగు సినిమాలకు ఆయన అందించిన పాటలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయి. సినీ గీతాలలో కూడా ఆయన సాహిత్య గంభీరత, సామాజిక చైతన్యం, మానవీయ విలువలు ప్రతిఫలించాయి. ప్రేమ, జీవితం, సమాజం, శ్రమ గౌరవం వంటి భావాలను సులభమైన కానీ ప్రభావవంతమైన పదాలతో వ్యక్తపరిచారు. అందువల్ల ఆయన సినిమా పాటలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి.

శ్రీశ్రీ రచనల ప్రత్యేకత ఏమిటంటే అవి కాలాన్ని దాటి నేటికీ ప్రాసంగికంగా ఉండటం. సమాజంలో ఇంకా కనిపించే పేదరికం, అన్యాయం, అసమానతలను చూసినప్పుడు ఆయన పదాలు ఇప్పటికీ సజీవంగా అనిపిస్తాయి. అందుకే ఆయనను ప్రజాకవిగా గౌరవిస్తారు.

మొత్తంగా చెప్పాలంటే, శ్రీశ్రీ రచనలు తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపించాయి. అవి మనలో ఆలోచనలను రేకెత్తిస్తూ, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తాయి. ఆయన సాహిత్యం కేవలం చదవడానికి మాత్రమే కాదు, జీవన మార్గాన్ని చూపించే దీపస్తంభం వంటిది. తెలుగు సాహిత్యంలో ఆయన స్థానం ఎప్పటికీ అజరామరం.



### గుంటూరు మార్పుకు

# శ్రీకారం చుట్టిన యువత

### ప్రణాళిక రూపకల్పనలో పౌర సంస్థలు

**గుంటూరు (జయ జయహే)**

గుంటూరు మార్పుకు నడుం బిగించిన వందలాది యువతీ, యువకులు ఈనెల 12వ తేదీ ఆదివారం గుంటూరులోని టి.జె.పి.ఎస్. కళాశాల ఆడిటోరియంలో నగరం ఎదుర్కొంటున్న పారిశుద్ధ్యం, ట్రాఫిక్, విద్య, వైద్య రంగాలలో గల సమస్యల పరిష్కారం కోసం 7 బృందాలుగా ఏర్పడి చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సేవాతత్పరులు, ప్రముఖ వ్యాపారవేత్త త్రిపుర మల్లు అరుణ్ కుమార్ ప్రసంగిస్తూ కనెక్ట్ అనే పేరుతో గుంటూరు నగరంలో పనిచేస్తున్న పలు పౌర సంస్థల యువతీ, యువకులను ఐక్యపరిచి నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు పయనిద్దామని పిలుపునిచ్చారు. గుంటూరులో దాతృత్వం గల వారిని ఎంపిక చేసి నగర అభివృద్ధిలో భాగస్వామ్యులను చేసే దిశగా కృషి జరుపుతామన్నారు. వుయ్ ఆర్ విత్ యు వ్యవస్థాపకులు సిగనం అయ్యప్ప ప్రసంగిస్తూ 6 సంవత్సరాలు క్రితం ఏర్పాటైన తమ సంస్థ అనితి కాలంలోనే 2 వేల మంది యువతీ, యువకులను వాలంటీర్లుగా నమోదు చేసుకుని ప్రతిభ గల 85 మంది పేద, అనాథ విద్యార్థులను దత్తత తీసుకుని అత్యున్నత విద్యను అందించే స్థితికి చేరుకున్నామని తెలిపారు. భారతదేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా పురోగతి సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఆ వైపు అడుగులు వేస్తున్నామని సభా ముఖంగా ప్రకటించారు. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1990వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లా నుండి దాదాపు 50 వేల మంది యువత స్వచ్ఛంద కార్యకర్తలుగా అక్షర కేంద్రాలను నిర్వహించి లక్షలాది మంది నిరక్షరాస్యుల జీవితాలలో అక్షర వెలుగులను అందించారని తద్వారా 17 శాతం అక్షరాస్యతలో వృద్ధిని సాధించగలిగామని తెలిపారు. నేడు గుంటూరులో మానవత్వం సేవాతత్వరత గల యువత ఏకత్రాటి పైకి వచ్చి నగర అభివృద్ధిపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. టిజెపిఎస్ కళాశాల సెక్రటరి కె.వి బ్రహ్మం ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి సమాజం నుండి లబ్ధి పొంది వృద్ధి సాధించిన తర్వాత సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమౌతుందని పేర్కొన్నారు. నగరంలో ఏ మంచి కార్యక్రమానికైనా టిజెపిఎస్ కళాశాల పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్మెల్ సేవాసదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకాస్ ప్రసంగిస్తూ గత మూడు దశాబ్దాలుగా మానసిక వైకల్యం గల 250 మంది మహిళలకు పొన్నూరు లో 80 మంది పురుషులకు గుంటూరులో భోజన, వసతి తో పాటు వైద్య సదుపాయాన్ని కార్మెల్ సేవా సదన్ కల్పిస్తుందని వివరించారు. ఆపదలో ఉన్న వారికి సహాయ పడటం యువత లక్షణంగా ఉండాలని కోరారు.

# చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు చారిత్రక అవసరం

## ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

మహిళా సాధికారత కేవలం నినాదం కాదు, అది ప్రధాని మోదీ ప్రభుత్వ విధానమని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. ఆదివారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు మరికొద్ది రోజుల్లోనే పార్లమెంటు ముందుకు రానుండటం హర్షణీయమని, ఇది భారతీయ మహిళల దశాబ్దాల కల అని కొనియాడారు.



**మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట**

మహిళా మూర్తులకు ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం మహిళా రిజర్వేషన్ బిల్లును ధైర్యసాహసాలతో లోక్‌సభలో ప్రవేశపెట్టారని ఆమె తెలిపారు. ఈ బిల్లులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు సైతం సముచిత ప్రాతినిధ్యం ఉ ఒటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో 15 శాతం, రాజ్యసభలో 14 శాతం మాత్రమే ఉన్న మహిళా ప్రాతినిధ్యం ఈ బిల్లుతో మరింత పెరుగుతుందని, తద్వారా దేశాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సంక్షేమ పథకాలతో మారుతున్న లింగ నిష్పత్తి**

గతంలో 1,000 మంది పురుషులకు కేవలం 824 మంది మహిళలు ఉండగా, 'బేటీ బచావో - బేటీ పడావో' వంటి పథకాల వల్ల ప్రస్తుతం ఆ సంఖ్య 1,024కు చేరడం శుభపరిణామమని పురంధేశ్వరి పేర్కొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన: ఆడపిల్లను లక్ష్మీదేవిగా భావించేలా ఈ పథకం మార్పు తెచ్చింది.

ఆరోగ్య రక్షణ: మాతృత్వ వందన పథకం ద్వారా గర్భిణీలకు పౌష్టికాహారం, ఇంద్రధనుష్ ద్వారా శిశువులకు 7 రకాల ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు.

విద్యావకాశాలు: కస్తూరిబా గాంధీ విద్యాలయాల ద్వారా బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

**ఆర్థికంగా మహిళలు బలోపేతం**

మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా ఆర్థికంగా ఎదగాలన్నదే బీజేపీ లక్ష్యమని ఆమె అన్నారు.

జన్ ధన్ యోజన: దేశవ్యాప్తంగా 52 కోట్ల ఖాతాలు తెరిచారని, వీరికి రూ. 30 వేల ఉచిత ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పారు.

ముద్ర ఁ స్టాండ్ అప్ ఇండియా: ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ. 10 నుండి 20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నారని, స్టాండ్ అప్ ఇండియా ద్వారా 83 శాతం మహిళలు లబ్ధి పొందారని తెలిపారు.

లఖ్‌పతి దీదీ: 3 కోట్ల మంది మహిళలను పెట్టుబడిదారులుగా మార్చే లక్ష్యంతో నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, 1,088 డ్రోన్లను మహిళా గ్రూపులకు అందించామని పేర్కొన్నారు.

**రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్లతో మహిళలు ముందుకు వచ్చారని, ఇప్పుడు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ రావడం వల్ల మహిళల ఆలోచనా దృక్పథం దేశ విధాన రూపకల్పనలో కీలకమవుతుందని పురంధేశ్వరి అన్నారు. 9 నుండి 10 శాతం వృద్ధి రేటును సాధించాలంటే మహిళా భాగస్వామ్యం తప్పనిసరని ఆమె ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.



# నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 12, జయ జయహే :**

ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించ బడుతుంది. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



# ఎన్టీఆర్ కాలనీలో నిత్యం మంచినీటి కష్టాలు

## మరమ్మత్తుల గురవుతున్న పైప్ లైన్లు

## త్రాగునీటి అవసరాలు తీర్చాలని స్థానికుల విజ్ఞప్తి

**టెక్కలి ఏప్రిల్ 12 జయ జయహే**

టెక్కలి పట్టణంలో ఎన్టీఆర్ కాలనీ 9వ లైన్ లో నిత్యం మంచినీటి కష్టాలు తప్పడం లేదు, అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం కాన రావడంలేదని స్థానికులు వాపోతున్నారు, ఈ లైన్ లో మంచినీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన పైప్లైన్లు నాణ్యత లోపంతో నిర్మాణాలు చేపట్టడం వల్ల త్రాగునీటి పైపులైను మరమ్మత్తులు పాలవుతున్నాయని స్థానిక వాసులు ఆవేదన చెందుతున్నారు, అధికారులకు వి న్నపాలు చేసినప్పటికీ మండువేసవిలో త్రాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ సిహెచ్ లింగరాజు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి త్రాగునీటి కష్టాలను తక్షణమే తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

# అల్లూరి జిల్లాలో విషాదం..





## నీట మునిగి ముగ్గురు బాలలు మృతి

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం పెదబయలు మండలం సికరి పంచాయతీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మత్య గెడ్డలో చేపల వేటకు వెళ్లిన నలుగురు బాలుల్లో ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందారు. మృతులను కోడా ప్రదీప్ (9), పాంగి శ్రీను (10), జల్లుంగి అర్షిత్ (10)గా గుర్తించారు. ఘటనలో మరో బాలుడిని స్థానికులు సమయానికి రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇటీవల కాలంలో అరకు నియోజకవర్గానికి చెందిన అనంతగిరి మండలం వలాసి పంచాయితీ మల్లంగుమ్మి జలపాతంలో హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ జంబువలస గ్రామానికి చెందిన బాలికలు సెల్ఫీల కోసం నీటిలోకి వెళ్లి ముగ్గురు బాలికలు మృతి చెందిన ఘటన మరిచిపోక ముందే, మళ్లీ ఇలాంటి సంఘటన జరగడం జిల్లాలో ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.





# రాజమండ్రిలో 'స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి' పోస్టర్ ఆవిష్కరణ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం నగరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో ఆదివారం 'స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి' మెగా ఫ్యాషన్ షో పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఎం.ఈవెంట్స్ మరియు న్యూజెన్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రాజమండ్రి ప్రాంతంలోని యువతీ యువకుల్లో దాగి ఉన్న మోడలింగ్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఈ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడలింగ్ రంగంలో కెరీర్‌ను ఆరంభించాలనుకునే వారికి ఇది ఒక మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏలూరులో నిర్వహించిన ఫ్యాషన్ షో విజయవంతం కావడంతో, అదే స్ఫూర్తితో రాజమండ్రిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ ఫ్యాషన్ షోలో పాల్గొనదలచిన వారికి ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 9949 04 0707 నెంబర్‌కు సంప్రదించి ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. త్వరలోనే ఆడిషన్స్ నిర్వహించి, తుది ప్రదర్శనకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రసాద్ ఆదిత్య మాల్ మేనేజ్‌మెంట్ సభ్యులు శరత్, హర్షలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాల్లోని మోడలింగ్‌పై ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈవెంట్ టీమ్ సభ్యులు, మోడల్స్ మరియు మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాడుగుల మండల బిజెపి ఎస్ఐఆర్ ఇన్చార్జిగా న్యాయవాది ప్రసాద్

**మాడుగుల ఏప్రిల్ 12 జయ జయహే**



మాడుగులకు చెందిన సీనియర్ న్యాయవాది భారతీయ జనతా పార్టీలి సీనియర్ నాయకులు శ్రీనాథ్ ప్రసాద్ రావు ని మాడుగుల మండల భారతీయ జనతా పార్టీ( ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇన్చార్జిగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ బాధ్యతలకు నియమిస్తూ జిల్లా పార్టీ ఆదేశాలు జారీ చేసినట్టు మండల పార్టీ అధ్యక్షుడు మెల్లిపాక స్వామి ఆదివారం తెలిపారు. ఒక సీనియర్ నాయకుడిగా మీకున్న అపారమైన అనుభవం పార్టీ బలోపేతానికి ఓటరు జాబితా సవరణ వంటి కీలక ప్రక్రియలను విజయవంతం చేయగలరని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేరుస్తానని చెప్పారు.

# ఈనెల15న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం

**మాడుగుల ఏప్రిల్ 12 జయ జయహే**



మాడుగుల మండలంలో నూతనంగా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమా లకు ఈ నెల 15న స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభోత్స వాలు చేస్తారని ఎండి ఒకే అప్పారావు తెలిపారు. వీటిలో భాగంగా ఉదయం మాడుగుల గర్ల్స్ హైస్కూల్లో ప్రహరీ గోడ ప్రారంభోత్సవం, సాగరంలో సిసి రోడ్లు, శంకరంలో పాఠశాల ప్రహరీ గోడ, కృష్ణం పాలెం లో సిసి రోడ్లు, లక్ష్మీపురం, కాశీపురంలో స్కూల్ ప్రహరీ గోడలు, ఎం కోడూరు, కాశిపురం లో సిసి రోడ్లు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే అదే రోజు మధ్యాహ్నం ముకుందపురం, వంటర్లపాలెం, కేజే పురం, ఎం కోటపాడు, ఎంకే వల్లపురం గ్రామాల్లో నిర్మించిన సిసి రోడ్లను కూడా ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు .



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

**చోడవరం ఏప్రిల్ 12 జయ జయహే**

రోలుగుంట మండలం కొమరోలు గ్రామానికి చెందిన ఇటంశెట్టి జగ్గం నాయుడు కుమారుడు అనారోగ్యం వల్ల ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. వారికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తము ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 60.734 రూపాయల చెక్కును ఆదివారం చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాసరి చిన్నబ్బాయి, పార్టీ నాయ కులు లొట్ల శివ, గ(ట్రేడ్డి దివాకర్, గ(ట్రేడ్డి సాయినాథ్ ,ద్వారపురెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహాన్ని తీర్చుతూ, సేవా స్ఫూర్తిని పంచుతూ...

# శ్రీ సత్యసాయి చలివేంద్రం ప్రారంభం

## 36 సంవత్సరాల నిరంతర సేవా యజ్ఞానికి ప్రశంసలు







**ఉక్కునగరం (జయ జయహే)**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డా. సలీం జి. పురుషోత్తమన్ మంత్రోచ్ఛారణల మధ్య, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉక్కునగరం టౌన్‌షిప్‌లోని విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ బస్ స్టాప్ వద్ద, శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న రెండు నెలలపాటు కొనసాగే , శ్రీ సత్యసాయి చలివేంద్రాన్ని ప్రారంభించి, సమాజానికి ఏడాది పొడవునా స్వార్థరహిత సేవలందిస్తున్న శ్రీ సత్యసాయి సేవా సమితిని అభినందించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో, విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ బస్ స్టాప్ వద్ద రెండు నెలల పాటు నిర్వహించబడే చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత 36 సంవత్సరాలుగా, ఈ చలివేంద్రం ప్రజలకు చల్లని త్రాగునీరు మరియు మజ్జిగ అందిస్తూ, ఎండాకాలంలో ఉపశమనం కలిగిస్తోంది. ఈ సేవను ప్రేమ, కరుణ, భక్తి, స్వార్థరహిత సేవకు ప్రతీకగా అభివర్ణిస్తూ, ఇవే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన విలువలని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని మూడు దశాబ్దాలకు పైగా అదే ఉత్సాహంతో కొనసాగిస్తున్న సమితి అంకితభావాన్ని ప్రశంసించారు. సమాజంతో కలిసి, సమాజం కోసం, సమాజంలో భాగంగా ఈ సమితి పనిచేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రత్యేకతగా కుటుంబ సమేతంగా సేవలో పాల్గొనడం, చిన్నా పెద్దా అందరిలో సేవాభావాన్ని పెంపొందించడం నిలుస్తోంది. ప్రతిరోజూ వందలాది ప్రయాణికులు ఈ సేవను వినియోగించుకుంటున్నారు. ఏపిఎస్‌ఆర్టీసి మరియు ప్రైవేట్ బస్సులు కూడా స్వచ్ఛందంగా ఆగడం విశేషం. బస్సు డ్రైవర్లకు మజ్జిగ బాటిళ్లు అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుతున్నారు. ఈ చలివేంద్రం ప్రేమ, కరుణ, సేవ, ఐక్యతకు సజీవ రూపంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్ ఎన్ నాయుడు , జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ జిల్లా; డి ఏ వి సన్యాసిరాజు , కన్వీనర్, ఉక్కునగరం సేవా సమితి; ఆర్ ఏ నాయుడు , జిల్లా సర్వీస్ వింగ్ కోఆర్డినేటర్, బి. సాయికుమార్ , సిటీ సేవా సమితి కన్వీనర్, ఎస్ కె ఆర్ కె రాజు , జాయింట్ కన్వీనర్, జి. రామకృష్ణ మాజీ కన్వీనర్,ఎం. విష్ణుమూర్తి , సర్వీస్ వింగ్ కోఆర్డినేటర్, ఆర్‌వి రావు , మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్‌ఆర్), విశాఖపట్నం స్టీల్ ప్లాంట్; ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితికి చెందిన జిల్లా మరియు సమితి పదాధికారులు, శ్రీ సత్యసాయి యువత, మహిళా విభాగ సభ్యులు మరియు భక్తులు సేవా భావంతో, కరుణతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మహిళలకు 33 శాతం రిజర్వేషన్

## దేశ భవిష్యత్తును మార్చే ఓ గొప్ప అడుగు

### బీజేపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి

**పాడేరు (జయ జయహే)**

రాజకీయాల్లో 14% ఉండే మహిళా ప్రాధాన్యతను 33 శాతానికి పెంచుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం అనేది దేశ భవిష్యత్తును మార్చే ఒక గొప్ప అడుగుగా భారతీయ జనతా పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి పేర్కొన్నారు. నారీ శక్తి వందన్ అధినియంలో భాగంగా చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించడం అనేది ఓ చారిత్రక నిర్ణయం అని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీల అందరి తరపున భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కు ధన్యవాదాలు తెలిపారు. మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచిన ఏకైక ప్రధానిగా నరేంద్ర మోడీ అని ఆమె అభివర్ణించారు. మహిళా శక్తితో భారత ప్రగతి పరుగులు పెట్టనుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు భారతదేశంలో భారతీయ జనతా పార్టీ మాత్రమే మహిళలకు అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పుకొచ్చారు. భారతదేశ అధిపతిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము , ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్ ఇలా ప్రతి అంశంలోనూ మహిళకు తొలి ప్రాధాన్యమిస్తూ భారతీయ జనతా పార్టీ అడుగులు వేసిందన్నారు. ఈ రోజు ఓ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని వారికి చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించిందని పేర్కొన్నారు. 2029 వరకు వేచి చూడకుండా 2026 నుంచే మహిళా రిజర్వేషన్లు 33% అమలు చేయడానికి సిద్ధం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వికసిత భారత్ 2047 లక్ష్యసాధనలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. పాలనా భాగస్వామ్యంలోనూ, చట్టసభల్లోనూ మహిళలు 33% ఉంటే కచ్చితంగా ప్రగతి పరుగులు పెడుతుందనే నరేంద్ర మోడీ నమ్మారు కాబట్టే అందరినీ ఒప్పించి ఈ బిల్లును ప్రవేశపెట్టాలని చెప్పారు. భవిష్యత్తులో మరింత మంది మహిళలు తమ స్వరాన్ని వినిపించే అవకాశాన్ని కల్పించాలని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక విధానం మాత్రమే కాదని మహిళా శక్తి పై ప్రభుత్వానికి ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. నారీ శక్తికి పెద్దపీట వేసిన ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ అని చెప్పారు. నారీ శక్తి వందన్ అధినియం ద్వారా విప్లవాత్మక మార్పు తెచ్చేందుకు నరేంద్ర మోడీ చేసిన కృషికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయన్నారు.



# విశాఖ గోల్ఫ్ కోర్స్‌కు రానున్న కపిల్‌దేవ్

## హైదరాబాద్‌లో కపిల్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం, ఏప్రిల్ 12, జయ జయహే :**

భారత జట్టుకు తొలిసారి ప్రపంచకప్ అందించిన క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్‌తో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కపిల్ దేవ్‌ను విశాఖపట్నం రావాల్సిందిగా ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తాను విశాఖ వస్తానని కపిల్ హామీ ఇచ్చినట్టు గంటా వెల్లడించారు. విశాఖ నగరం తనకు కూడా ఎంతో ఇష్టమని కపిల్ దేవ్ చెప్పారని, బీచ్ సిటీ పర్యటన కోసం ఎదురుచూస్తున్నానని, త్వరలోనే అక్కడి గోల్ఫ్ కోర్స్‌ను సందర్శిస్తానని కపిల్ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ విందు సమావేశంలో ప్రముఖ దర్శకుడు శివ కొరటాల, ఇతర మిత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 43 ఏళ్ల నాటి క్రికెట్‌తో పాటు, ప్రస్తుత తరం ఆట గురించి సుదీర్ఘంగా చర్చించుకున్నామని గంటా తెలిపారు. కపిల్ దేవ్ తన క్రికెట్ జీవితంలోని మధుర స్మృతులను పంచుకున్నారని పేర్కొన్నారు. ఈ భేటీలో రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి గురించి కపిల్ దేవ్‌కు వివరించినట్టు గంటా శ్రీనివాసరావు తన ప్రకటనలో తెలిపారు.



# డెత్ సర్టిఫికెట్లు సమయానికి మంజూరు చేయాలి

**అనంతగిరి: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపెల్లి పంచాయితీ బూరిగ చిన్న కోయిల కొండ శిఖర గ్రామాల్లో 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు.

పంచాయతీ కేంద్రం రొంపెల్లి స్వర్ణ సచివాలయానికి వెళ్లాలంటే 12 కిలోమీటర్,అనంతగిరి మండల కేంద్రానికి వెళ్లాలంటే 70 కిలోమీటర్,పాడేరు వెళ్లాలంటే150 కిలోమీటర్ దూరం ప్రయాణం చేస్తున్నాము.

గతంలో డెత్ సర్టిఫికెట్లు బర్త్ సర్టిఫికెట్లు అవసరం ఉండేది కాదు మాకు కనీస అవగాహన కూడా లేదు

గత ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడం డిజిటల్ సేవలు వాలంటీర్ వచ్చిన తర్వాత భర్త మరణిస్తే భర్త పేరు మీద ఆస్తి భార్యకు రావాలంటే డెత్ లీగల్ ఎయిర సర్టిఫికెట్లు ఉండాలి.

మాకు వాలంటీర్ ద్వారా కొంత అవగాహన వచ్చింది. నేడు మా గ్రామంలో 18 మంది లేటు డెత్ సర్టిఫికెట్ల కోసం సంవత్సరం నుండి దరఖాస్తు చేస్తున్న రెవిన్యూ అధికారులు కనీసం పట్టించుకోలేదనీ డెత్ ఇతర సేవలన్నీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

గతంలో స్థానిక రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చాము పాడేరు ఆర్డీఓ కి పంపించామని ఆర్డీవో కార్యాలయం కలిసాం.

ఫైల్ ఇంకా రాలేదు అని చెప్పారు. ఇప్పటికైనా గ్రామ స్వర్ణ పంచాయతీలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు వాటిపై జాయింట్ కలెక్టర్ స్వయానా విచారణ చేపట్టాలి. లేకపోతే మా గ్రామస్తులు అందరిని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తాము. సోముల అప్పలరాజు మాజీ వార్డు సభ్యుడు రొంపెల్లి. వనపర్తి సింహాచలం ( గిరిజన రైతు సంఘం నాయకులు). బద్నాని కొత్తమ్మ. సోముల ఎర్రయ్య. తదితరు గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర...!

## మతం పేరిట మనుష్యుల్లో విభజన

## ఘనంగా రేపు అంబేద్కర్ జయంతి వేడుకలు

## భారీ ఊరేగింపు, బహిరంగ సభ ఏర్పాటు

### అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లడి

**విశాఖపట్నం, ఏప్రిల్ 12, జయ జయహే :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతోత్సవాన్ని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ రావు తెలిపారు. రామా టాకీస్ రోడ్డులో గల అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు డాబా గార్డెన్స్ ఎలఐసి భవనం దరి అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్, రామా టాకీస్ మీదుగా అంబేద్కర్ భవన్ వరకు భారీ ఊరేగింపు, అనంతరం దేశం గర్వించిన మహా పురుషుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతోత్సవ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, విశిష్ట అతిథిగా నగర పోలీస్ కమిషనర్ డా. శంఖ బ్రత బాగ్చి , గౌరవ అతిథిగా హెచ్‌పిసిఎల్ సిజిఎం జి. కిరణ్ కుమార్ హాజరవుతారని చెప్పారు. అంబేద్కర్ అందరి వారని, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి జె వి. ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచం యుద్ధ వాతావరణంలో ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యుద్ధాలు , పేదరికం లేని సమాజాన్ని కాంక్షించారన్నారు. మతం పేరుతో మనుషుల మధ్య విభజన , రాజ్యాంగాన్ని మార్చే కుట్ర సాగుతుందన్నారు. సెంటు భూమి కూడా ప్రజలకు ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి లేనప్పటికీ రూ. 15 లక్షల కోట్లు అప్పులు ఎగవేసిన వారిపై మాత్రం ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థలకు 99 పైసలకే ఎకరా భూమి అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. దేశ సంపద కొందరి చేతుల్లోకి పోగొట్టకూడదని రాజ్యాంగం చెబుతుంటే దానికి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవహరించడం జరుగుతుందన్నారు. సొసైటీ కోశాధికారి డాక్టర్ గార సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు , విద్యార్థులకు సొసైటీ అండగా ఉంటుందని తెలిపారు. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో 100 మందికి లైబ్రరీ సదుపాయం కల్పించామని వారిలో 25 మంది ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. ప్రత్యేకంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల కోసం 50మంది మహిళలకు శిక్షణ ఇచ్చే నిమిత్తం జెవై అకాడమీతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఏ సి డార్మెటరీ ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం రూ.34 లక్షల హెచ్ పీసీఎల్ సిఎసఆర్ నిధుల కేటాయించిందని ,అంతకుముందు రూ.30 లక్షలు ఆధునిక గ్రంథాలయానికి విడుదల చేశారన్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ రూ.20లక్షలు నిధులు కేటాయించారన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ రూ.10 లక్షలు, మాజీ ఎంపీ ఎం.వి వి.సత్యనారాయణ ఎంపీ లాడ్స్ నుండి రూ 24 లక్షలు అంబేద్కర్ భవన్ అభివృద్ధికి నిధులు విడుదల చేసి సహకరించారన్నారు. ఈ నిధుల ద్వారా మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.పేద ,దిగువ మధ్యతరగతి పిల్లలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని చెప్పారు . కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు రాజాన సరస్వతి , తాడి కాంతారావు, బోని అప్పారావు,రాజు తదితరులు పాల్గొన్నారు

# మీ కోసం గ్రీవెన్స్ డే తప్పని సరిగా నిర్వహించాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**పాడేరు,(జయ జయహే)**

ఏప్రిల్ 12: ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో మీ కోసం 'గ్రీవెన్స్ డే' తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, ఐటిడిఎ పి ఓ ఆదిత్య వర్మ, ఆర్డీవో ఎం వి ఎస్ లోకేశ్వరరావు, డిఆర్వో నీలకంఠరావు, మరియు అన్ని జిల్లా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు.

**అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి**

రేపటి నుండి ప్రతీ సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు అగ్రికల్చర్, ఇంజనీరింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ విద్య,



ఇంజనీరింగ్, ఐసిడిఎస్, హౌసింగ్, డీఆర్డీఏ తదితరులు తప్పనిసరిగా హాజరుకావాలని, గ్రీవెన్స్ సక్రమంగా జరుగుతుందో లేదో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలని, డిఆర్వో ఇందుకు సహకరించాలని సూచించారు. ప్రతి మండలంలో ఏ అధికారులు హాజరయ్యారు, ఎవరు గైర్హాజరయ్యారు అనే వివరాలతో కూడిన అటెండెన్స్ లిస్ట్‌ను వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే వినతులను ఆ శాఖల లాగిన్ లలో రిజిస్ట్రేషన్ చేయించి, ఎప్పటికప్పుడు పరిష్కరించేలా గ్రీవెన్స్ నిర్వహణ అత్యంత సమర్థవంతంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు, మండలాల తహసీల్దార్లు మరియు ఎంపీడీవోలు పాల్గొన్నారు. అధికారులు తమ పరిధిలోని కింది స్థాయి సిబ్బందికి కూడా ఈ ఆదేశాలను వెంటనే చేరవేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న మీ కోసం పీజీఆర్ఎస్ కోసం అన్ని గ్రామాల్లో ప్రజలకు చేరువయ్యేలా ఎంపిడిఓ, తహసీల్దార్ లు టామ్ టామ్ ద్వారా గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం కల్పించి సమర్థవంతంగా నిర్వహించేటట్లు ఆదేశించారు. పై ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# కళాభారతిలో పైడా కౌశిక్ నాటకోత్సవాలు ప్రారంభం

## ముఖ్య అతిథిగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్





**విశాఖపట్నం, ఏప్రిల్ 12, జయ జయహే**

విశాఖలోని కళాభారతిలో జరుగుతున్న పైడా కౌశిక్ నాటకోత్సవాలు కదురమ్యశీగా జరుగుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమానికి ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళాభారతి కార్యదర్శి శ్రీరామదాస డాక్టర్ రాంబాబు, మహారాజ పోషకులు పైడా కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు గౌరవ అతిథిగా ఆర్ హెచ్ నారాయణ, ట్రస్టీ సుసర్ల రామగోపాల్, డాక్టర్ కేజీ వేణు జ్యోతి ప్రకాశనం చేసి శుభారంభం చేశారు. ఈ ఐదు రోజుల నాటకోత్సవాల్ని యార్లగడ్డ ఆదివారం ప్రారంభించారు. రాంబాబు మాట్లాడుతూ కళాభారతి కళల్ని ప్రోత్సహించేందుకు 40ఏళ్లుగా సేవ చేస్తోందని ఇంకా చేస్తూనే ఉంటుందని, అతి తక్కువ అద్దెకు కళాభారతి అందరికీ అందుబాటులో ఉండే విధంగా నడుపుతున్నామన్నారు. ఈ నాటకోత్సవాల మహారాజ పోషకులుగా ఏఎస్ రాజా 2018వరకు ఉన్నారని, 2019నుంచి పైడా కృష్ణ ప్రసాద్ వ్యవహరిస్తున్నారంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. యార్లగడ్డ మాట్లాడుతూ నాటకాల ద్వారా చక్కటి సందేశాల్ని సమాజానికి అందించవచ్చు అని, అటువంటి నాటక కళను, కళాకారుల్ని ప్రోత్సహిస్తూ కళాభారతి నిర్వహిస్తున్న ఐదు రోజుల ఉత్సవాలకు విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానన్నారు.

**నా తర్వాతా కొనసాగుతుంది**

పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తన తర్వాత కూడా ఈ సహకారం కొనసాగుతుందని ప్రకటించారు. యార్లగడ్డ సంకల్పం ఎంత గొప్పదో 40ఏళ్లయినా వారి ఆశయాలను కొనసాగిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కమిటీ వారిని అభినందించారు. స్వర్గీయ బీవీఏ నాయుడు స్మారక కళా ప్రాంగణంగా పరిగణించి ఘనంగా నివాళులర్పించారు.

సభ అనంతరం ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'అనగనగా ఓ రాత్రి నాటకాన్ని పీవీ సత్యనారాయణ రచనలో మహ్మద్ ఖాజావలి దర్శకత్వంలో, ఇంటింటికి బొట్టు- విజయానికి తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నర్సింహం తన నియోజకవర్గ పరిధిలోని ఒక గిరిజన తండాకు మందీ మార్భలంతో వెళతారు. హఠాత్తుగా తీవ్రవాదులు దాడిచేయడంతో, గిరిజనుడైన బాలియా కుటుంబం దగ్గర తల దాచుకుశీటాడు. ఎమ్మెల్యే రక్షణకు హామీ ఇచ్చిన ఆ కుటుంబం ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యేను రక్షిస్తుంది. గిరిజన ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యల్ని ఆ రాత్రి స్వయంగా తెలుసుకున్న ప్రజాప్రతినిధి చలించిపోతాడు. అంత కష్టంలోనూ ప్రాణాలకు తెగించి తమను కాపాడిన ఆ గిరిజన ప్రజల నిజాయితీకి కరుడుగట్టిన ఎమ్మెల్యే ఆలోచనలో మార్పు చోటు చేసుకుంటుంది. ఆ చీకటి రాత్రి తనలోని స్వార్థంతో నిండిన అంధకారాన్ని తరిమికొట్టి, తన గిరిజన ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి శ్రీకారం చుడతాడనే సారాంశాన్ని నాటక రూపంలో అందరూ చూశారు

**పురస్కారాలు**

'రంగస్థల కళాభారతి' బిరుదు పురస్కార సభలో డాక్టర్ రాంబాబు, మహారాజ పోషకులు పైడా కృష్ణ ప్రసాద్, ముఖ్య అతిథి వీఎస్ మణికంఠ, మరో అతిథి యార్లగడ్డ చేతుల మీదుగా 2026 సంవత్సర జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు, ప్రయోక్త బొట్టా వేణు గోపాలరావుకు అందజేశారు. బిరుదుతో పాటు రూ.10వేల నగదు, దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. అలాగే సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో 'వర్క్ ఫ్రం హోం' నాటకాన్ని ప్రదర్శించారు. ప్రతి మనిషిలోను ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. తమ మనసుకి నచ్చిన పనిలో మమేకమైనప్పుడు అది మొగ్గతొడిగి వెల్లివిరుస్తుంది. ఆ ప్రతిభే మరోసారి చిక్కుల్లోకి నెట్టి పరీక్షిస్తుంది. ఆ చిక్కుల్ని అధిగమించి అప్రతిహతంగా దూసుకుపోయే వాడే విశ్వాన్ని సైతం ఒడిసి పట్టగలడు. అనుకున్నది సాధించగలడు. సాధరణ సాఫ్ట్ వేర్ ఉద్యోగి సుధీర్ వంటల్లోనూ నిష్ణాతుడు. అతివల కన్నా అద్భుతంగా రుచికరమైన వంటలు చేసే ప్రావీణ్యం అతని సొంతం, గమ్మత్తేమిటంటే వంట చేయటమంటే ఆసక్తిలేని సౌమ్య అతనికి అర్థాంగిగా రావటం, కాఫీ కూడా కలపటం కూడా నేర్చుకోని భార్యతో కొత్త కాపురం మొదలెడతాడు. దానికి తోడు తన పెళ్లి కుదిర్చిన స్నేహితుడు కిరణ్ సరదాగా చేసిన పని అతన్ని కష్టాల్లోకి నెడుతుంది. ఐనప్పటికీ 'వర్క్ ఫ్రమ్ హోం'కు పర్మిషన్ తీసుకుని ఒక పక్క వంట, మరోపక్క ఉద్యోగంతో సతమతమవుతూ ఉంటాడు. అదేం పట్టని భార్య సౌమ్య భర్త వంట ప్రావీణ్యాన్ని బంధువులకు చేరవేస్తూ, బిజీగా ఉంటుంది. వారంతా వీరి కొత్త కాపురాన్ని పరామర్శించే పేరిట వచ్చి పోతుండటంతో వారికి మర్యాదలు చేయలేక, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేక ఒత్తడికి లోనవుతాడు. చివరికి సాహసించి ఉద్యోగానికి రిజైన్ చేసి 'సౌమ్యలక్ష్మి పేరుతో కొత్త స్టార్టప్ ను ప్రారంభించి తన ఆనందంతో నాటిక ముగిసి చక్కటి సందేశాన్నిచ్చి ఆ నాటకం అందరి మన్ననల్ని పొందింది.

**చివరిగా**

చివరిలో లాటరీలో నేడు అనే నాటకంలో.. వచ్చిన ప్రేక్షకులకు గెలిచిన వారికి సీఎంఆర్ షాపింగ్ మాల్ స్పాన్సర్ చేయగా గెలిచిన వారికి అందజేయడం జరిగింది. చివరగా అందరూ ప్రసాదాలు తీసుకుని వెళ్లారు చివరిగా కార్యదర్శి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం మొదటి నాటిక చిటికెన వేలు, రెండో నాటిక నీళ్లు ప్రదర్శింపబడతాయని, సమయానికి అంతా విచ్చేసి ఆనందించి ప్రోత్సహించాలని కోరారు.

# పాకిస్థాన్‌లో జరిగిన అమెరికా-ఇరాన్ ఉన్నత స్థాయి చర్చలు విఫలం

**అమెరికా తమ నమ్మకాన్ని గెలవడంలో విఫలమైందన్న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘలీబాఫ్**

**తమ షరతులను ఇరాన్ అంగీకరించలేదంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆరోపణ**

**అణ్వాయుధాలు తయారు చేయబోమని దీర్ఘకాలిక హామీ ఇవ్వాలని అమెరికా డిమాండ్**

**ఇప్పటికే తమ తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచామని వెల్లడి**

**(జయ జయహే)**



అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపిన అమెరికా-ఇరాన్ ఉన్నత స్థాయి చర్చలు విఫలమయ్యాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా సుమారు 21 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ చర్చలు ఎలాంటి ఒప్పందం కుదరకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడంపై ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. చర్చల సమయంలో అమెరికా తమ నమ్మకాన్ని పొందడంలో పూర్తిగా విఫలమైందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఖేర్ ఘలీబాఫ్ ఆరోపించారు. మరోవైపు, తమ షరతులను అంగీకరించడానికి ఇరాన్ నిరాకరించిందని, ఇది అమెరికా కంటే ఇరాన్‌కే ఎక్కువ నష్టమని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ



వాన్స్ హెచ్చరించారు.

చర్చల అనంతరం ఆదివారం ఘలీబాఫ్ 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులు చేశారు. ఇరాన్ ప్రతినిధి బృందం పూర్తి సద్భావనతో, నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలతో చర్చలకు హాజరైందని తెలిపారు. "చర్చలకు ముందు మేం పూర్తి చిత్తశుద్ధితో ఉన్నామని స్పష్టం చేశాం. కానీ గత రెండు యుద్ధాల అనుభవాల దృష్ట్యా వారి(అమెరికా)పై మాకు నమ్మకం లేదు. మా ప్రతినిధులు ఎన్నో మంచి ప్రతిపాదనలు చేసినా, ఈ దఫా చర్చల్లో ఇరాన్ ప్రతినిధి బృందం నమ్మకాన్ని గెలుచుకోవడంలో అవతలి పక్షం విఫలమైంది" అని ఆయన పేర్కొన్నారు.

"మా వాదన, మా సూత్రాలు అమెరికాకు అర్థమయ్యాయి. ఇప్పుడు మా నమ్మకాన్ని పొందగలదో లేదో నిర్ణయించుకోవాల్సింది వారే" అని ఘలీబాఫ్ మరో పోస్టులో సవాల్ విసిరారు. దేశ ప్రజలు తమకు అండగా నిలిచారని, 21 గంటల పాటు చర్చల్లో పాల్గొన్న తన సహచరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా చర్చల వైఫల్యంపై స్పందించారు. "మేం 21 గంటల పాటు చర్చలు జరిపాం. ఇరాన్‌తో అనేక విషయాలపై మాట్లాడాం. ఇది శుభవార్తే అయినా, ఎలాంటి ఒప్పందం కుదరకపోవడం దురదృష్టకరం" అని ఆదివారం ఉదయం మీడియా సమావేశంలో తెలిపారు. "ఈ చర్చల్లో మా పరిమితులు ఏమిటో, ఏయే అంశాల్లో సర్దుకుపోగలమో, వేటిలో రాజీపడలేమో చాలా స్పష్టంగా చెప్పాం. కానీ మా షరతులను అంగీకరించడానికి వారు నిరాకరించారు. ఈ ఫలితం అమెరికా కన్నా ఇరాన్‌కే ఎక్కువ నష్టం కలిగిస్తుంది" అని వాన్స్ వ్యాఖ్యానించారు.

ఇరాన్‌ను అణ్వాయుధ సామర్థ్యం పొందకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని వాన్స్ పునరుద్ఘాటించారు. "అణ్వాయుధాలను తయారుచేయబోమని ఇరాన్ నుంచి మాకు స్పష్టమైన హామీ కావాలి. కేవలం ఇప్పుడో, రెండేళ్లకో కాదు.. దీర్ఘకాలికంగా ఈ హామీ ఉండాలి. అలాంటి నిబద్ధత వారిలో ఇంకా కనిపించలేదు. త్వరలోనే అది వస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు. వాషింగ్టన్ ఇప్పటికే తన తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచిందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ, తనిఖీల వంటి అంశాలపై గతంలోనూ చర్చలు జరిగి మధ్యలోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజా వైఫల్యంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన మరింత ముదిరినట్లయింది.



# డొక్కా సీతమ్మ మజ్జిగ పంపిణి చలివేంద్రం

**విజయనగరం( జయ జయహే)**

43. 44 వ డివిజన్ జనసేన యువనాయకులు పతివాడ చంద్రశేఖర్ (చిన్ని) డొక్కా సీతమ్మ మజ్జిగ పంపిణి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా హాజరైన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ టౌన్ మరియు మండల నాయకులు వీర మహిళలు జనసైనికులు, 43,44 డివిజన్ కూటమి ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేసారు



# వివేకానంద డయాగ్నజిస్ట్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చొక్కాకుల

**విశాఖపట్నం, జయ జయహే**

విశాఖ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర నూతనంగా ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద డయాగ్నజిస్ట్ అండ్ రీచర్చ్ సెంటర్ ను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, విశాఖపట్నం బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు ఎం. రవీంద్ర రెడ్డి, పి. మురళీరాజు దామోదర్ యాదవ్ లతో పాటు బిజెపి సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవకులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



# అమ్మవారి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న చొక్కాకుల

**విజయనగరం జిల్లా (జయ జయహే)**


కొత్తవలస మండలం, కాటకాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ శిఖరం మరియు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శృంగవరపుకోట నియోజకవర్గం శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారి మరియు బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి.వి రత్నాజీ, విజయనగరం జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు చొక్కాకుల అప్పారావు జగదీశ్వరి దంపతులు, ఆర్ పి నాయుడు (ఒరిస్సా నాయుడు), చొక్కాకుల నారాయణమూర్తి లావణ్య దంపతులు, చొక్కాకుల అప్పారావు (చంటి), బాదిరెడ్డి రమణ, చొక్కాకుల పెద్ద కృష్ణమ్మ గారి నాయుడు, భూసాల చెల్లయ్య పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం

**(జయ జయహే)**

బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ సభ్యత్వాన్ని స్వీకరించి, శాసన మండలికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీజేపీ, జేడీయూ నాయకులు ఆయనతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ, భవిష్యత్ వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా పేర్కొన్నారు. అయితే ఆ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఆదివారం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌ను కలిసిన అనంతరం సంజయ్ ఝా విలేకరులతో మాట్లాడారు.

అయితే, సంజయ్ ఝా వెంట ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జేడీయూ సీనియర్ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ చౌదరి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ సిఫార్సు మేరకు ఎన్‌డీఏ శాసనసభ్యులు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని తెలిపారు. "కొత్త ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ విషయాల్లో వారికి ఒక నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. వారు తమ ప్రణాళికతో ముందుకు వచ్చిన తర్వాత, తదుపరి చర్యలు జరుగుతాయి. బిహార్‌లో మొదటి సారిగా బీజేపీ ముఖ్యమంత్రి పదవిని పొందేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ అభ్యర్థిని మాత్రం కేంద్ర నాయకత్వమే ఎంపిక చేస్తుంది. అనంతరం ఎన్‌డీఏ శాసనసభ పక్షం ఆ పేరును ఆమోదిస్తుంది" అని విజయ్ కుమార్ చౌధరీ పేర్కొన్నారు.



## హార్ట్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండాలంటే...

### వీటికి దూరంగా ఉండండి

**గుండె ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని ఫుడ్స్ తీసుకోవాలి. మరికొన్ని ఫుడ్స్‌ని అసలే తీసుకోవద్దు. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగి గుండె సమస్యలకి కారణమవుతుంది. అందుకోసమే కొన్ని ఫుడ్స్ తీసుకోవడాన్ని తగ్గించాలి. అలాంటి ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి.**

**శాచ్యురేటెడ్ ఫ్యాట్స్..**
ఈ ఫ్యాట్స్‌నే చెడు కొలెస్ట్రాల్ అంటారు. దీనిని తీసుకోవడం వల్ల మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. పేస్ట్రీలు, బిస్కెట్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవద్దు. మీట్‌ని తీసుకోవడాన్ని తగ్గించాలి. వీటితో పాటు ఫ్రైడ్ ఫుడ్స్, చిప్స్, బేక్డ్ ఫుడ్స్, మైదాతో తయారైన ఫుడ్స్ తీసుకోవద్దు.

**గుండెపోటు ముందు కనిపించే లక్షణాలు..**

**షుగర్ ఫుడ్స్..**
షుగర్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. బరువు పెరుగుతారు. దీని వల్ల ఆటోమేటిగ్గా గుండెపై ఎఫెక్ట్ పెడుతుంది. కాబట్టి, వీటిని తీసుకోవద్దు.

**సోడియం..**
మనం తీసుకునే ఫుడ్స్‌లో సోడియం ఎక్కువగా ఉంటే గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఏవైనా ఫుడ్స్ తీసుకున్నప్పుడు సోడియం కంటెంట్ తక్కువగా ఉండేలా చూసుకోండి.

**కూల్‌డ్రింక్స్..**
కూల్ డ్రింక్స్‌లో కూడా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. గుండెకి కూడా మంచిది కాదు. కాబట్టి, కూల్ డ్రింక్స్‌ని తీసుకోవద్దు. ఇవే కాదు.. పండ్లతో తయారైన జ్యూస్ కూడా తాగొద్దు. ఇందులో ఎక్కువగా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ప్యాకేజ్డ్ డ్రింక్స్ తాగొద్దు. వీటి వల్ల కూడా షుగర్ తీసుకున్నట్లే అవుతుంది.

**ఆల్కహాల్..**
ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కూడా గుండె సమస్యలు వచ్చే రిస్క్ పెరుగుతుంది. కాబట్టి, ఆల్కహాల్ తీసుకోవడాన్ని తగ్గించాలి.

**కెఫిన్ డ్రింక్స్..**
కెఫిన్ ఎక్కువగా ఉండే డ్రింక్స్ కూడా గుండెకి అంత మంచివి కావు. వీటిని తీసుకోవడం వల్ల గుండెపై ఎఫెక్ట్ పడుతుంది. కాఫీ వంటివి తీసుకున్నా మోతాదులోనే తీసుకోవాలి.

# ఇల్లు ఊడ్చి, చక్కగా తుడిచే రోబో క్లీనర్

## మీరు చెప్పినట్టు వింటుంది




**ప్రతిరోజు ఇల్లు ఊడిచి, తడిగుడ్డ వేసి అలసిపోతున్నారా. అయితే మీరు వీటి గురించి తెలుసుకుని తీరాల్సిందే. ఇవి మీకు శ్రమ లేకుండా ఇంటిని సూపర్ ఫాస్ట్‌గా శుభ్రం చేసేస్తాయి. అంతేకాదు ఇంటిలోని ప్రతి మూలను మెరిపిస్తుంది. ఇంతకీ అవి ఏంటో ఈ స్టోరీలో చూద్దాం..**

మహిళలకు వంట పని తర్వాత ఇబ్బంది కలిగే పని అంటే ఇళ్లు క్లీనింగ్. ఎందుకంటే ఇల్లు ఊడ్చి తడిగుడ్డ పెట్టాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని. సోఫా కింద, మంచం కింద, బీరువాల కింద వంగి ఊడవాలన్నా, తడిగుడ్డ పెట్టాలన్నా చాలా కష్టం. ఇక ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో ఒక పక్క ఉద్యోగాలు చేసుకుంటూ.. మరో పక్క పిల్లల్ని చూసుకోవడం, ఇంటి పనులు చేయడం అంటే పని భారం మామూలుగా ఉండదు. పని చేసే ఓపిక ఉన్నా సమయం ఉండదు. ఒక్కోసారి సమయం ఉన్నా.. పనులు చేసేందుకు ఓపిక ఉండదు. అయితే వీటన్నింటికి చెక్ పెట్టేందుకు మీకోసం ఒక అద్భుతమైన ప్రొడక్ట్ వచ్చేసింది. అదే "రోబో వ్యాక్యూమ్ క్లీనర్". మీరు రిమోట్‌తో ఆపరేట్ చేస్తే చాలు.. దాని పని అది చేసుకుంటుంది. అసలు ఇది ఎలా పనిచేస్తుంది?

బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషీన్లు, గిన్నెలు శుభ్రం చేయడానికి డిష్ వాషర్లు, ఇంటిని శుభ్రం చేయడానికి వ్యాక్యూమ్ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆల్ రెడీ వాక్యూమ్ క్లీనర్లు ఉన్నాయి కాదా.. మళ్లీ ఈ రోబో క్లీనర్లు ఎందుకూ అనే డౌట్ మీకు రావచ్చు. అయితే వ్యాక్యూమ్ క్లీనర్లను మనం ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి మాత్రమే అవి ఉపయోగపడతాయి. ఆ తర్వాత ఇళ్లు తుడవాలంటే మాప్‌లు ఉపయోగించాల్సిందే. అదే ఈ రోబో వాక్యూమ్ క్లీనర్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. ఇది కూడా ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా వీటిలోని పలు మోడల్స్ ఇల్లు ఊడ్చేసి తడిగుడ్డ కూడా పెట్టేస్తాయి.

**ప్రయోజనాలు చూస్తే:**

ఆటోమెటిక్‌గా శుభ్రం చేయడం: సాధారణంగా వ్యాక్యూమ్ క్లీనర్ల వెంట మనం ఉండాల్సిందే. కానీ వీటికి మనం వెంట ఉండనవసరం లేదు. జస్ట్ ఆన్ చేస్తే చాలు ఇవి స్వయంగా ఇంటిని శుభ్రం చేస్తాయి.

అన్ని రకాల నేలలపై పని చేస్తాయి: కార్పెట్లు, టైల్స్, లామినేట్ ఫ్లోరింగ్ వంటి అన్ని రకాల నేలలపై ఇవి సమర్థవంతంగా పని చేస్తాయి.

చెత్తను సేకరించడం: చిన్న చిన్న ముక్కలు, జుట్టు, బిస్కెట్ ముక్కలు ఇలా ఒక్కటేమటి అన్ని రకాల చెత్తను సులభంగా సేకరించి అందులోనే స్టోర్ చేసుకుంటాయి. తర్వాత దాని నుంచి చెత్తను తీసివేస్తే సరి.

షెడ్యూల్ చేయడం: మనం నచ్చిన సమయంలో ఆటోమేటిక్‌గా శుభ్రం చేయడానికి షెడ్యూల్ చేయవచ్చు.

అధునాతన ఫీచర్లు: కొన్ని రోబో వాక్యూమ్ క్లీనర్‌లలో మ్యాపింగ్, వాయిస్ కమాండ్‌లు, అప్లికేషన్ కంట్రోల్ వంటి అధునాతన ఫీచర్లు ఉంటాయి.

శత్రువులను ఖతం చేసే AI రోబో'– ఎనిమీ ఎక్కడ ఉన్నా గురితప్పదు! యుద్ధభూమిలో 360 డిగ్రీల కవరేజ్!

**ఎలా ఆపరేట్ చేయాలి:**

ముందుగా ఛార్జింగ్ పెట్టాలి. ఆ తర్వాత బటన్ ప్రెస్ చేస్తే ఆన్ అవుతుంది. లేదా రిమోట్ ద్వారా కూడా ఆపరేట్ చేయవచ్చు.

కొన్ని క్లీనర్లకు మొబైల్ యాప్ ద్వారా ఆదేశాలు ఇవ్వొచ్చు.. మరికొన్ని వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ చేయొచ్చు.

ఫోన్లో యాప్ ద్వారా టైమ్ సెట్ చేస్తే చాలు.. ప్రతిరోజూ ఆ టైమ్ ప్రకారం వాటంతటవే పని చేస్తాయి.

మనం ఇంట్లోలేకున్నా వాటిని ఆపరేట్ చేయొచ్చు.

అలాగే వాటిని ఉపయోగించేటప్పుడు క్లీనింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. అంటే..

ఆటో మోడ్: క్లీనర్ స్వయంగా ఇంటిని స్కాన్ చేసి క్లీన్ చేస్తుంది.

స్పాట్ క్లీనింగ్: ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని క్లీన్ చేయడానికి ఈ మోడ్ ఆన్ చేయాలి.

ఎడ్జ్ క్లీనింగ్: గోడల వెంబడి క్లీన్ చేయడానికి.

షెడ్యూల్ క్లీనింగ్: ముందే నిర్ణయించిన సమయం ప్రకారం క్లీనర్ స్వయంగా ఆన్ అవుతుంది. పని చేస్తూ వెళుతుంది.

మీకు కావాల్సిన క్లీనింగ్ మోడ్‌ను ఎంచుకున్న తర్వాత.. స్టార్ట్ బటన్ లేదా యాప్/రిమోట్ ద్వారా ఆన్ చేస్తే క్లీనర్ తన పనిని ప్రారంభిస్తుంది.

క్లీనింగ్ పూర్తయిన తర్వాత.. అది ఆటోమెటిక్‌గా ఛార్జింగ్ డాక్‌కు తిరిగి వెళుతుంది. ఆ తర్వాత పవర్ ఆఫ్ చేస్తే సరి. కొన్ని క్లీనర్స్ ఆటోమెటిక్‌గా అవే ఆఫ్ అయిపోతాయి.

ఎక్కడ లభిస్తాయి?: ప్రస్తుతం ఈ రోబో వ్యాక్యూమ్ క్లీనర్లు ప్రముఖ ఈ–కామర్స్ సంస్థలలో అందుబాటులో ఉన్నాయి. ఫీచర్స్‌ను బట్టి ధరలు ఉంటాయి. అలాగే ప్రముఖ కంపెనీలు వీటిపై ఆఫర్స్ కూడా ప్రకటిస్తున్నాయి. యంత్రాల్లా ఉండే వీటిల్లో ఇంటి అవసరాల్ని బట్టి మనకు కావలసినదాన్ని ఎంచుకోవచ్చు, పనుల భారాన్ని తగ్గించుకోవచ్చు.

# ఈ రూల్స్ ఫాలో అయితే ఎవరైనా సక్సెస్ అవుతారు



**ప్రతి ఒక్కరి జీవితంలో రోజుకి 24 గంటలే ఉంటాయి. ప్రతి ఒక్కరికీ ఉండేవి అదే రాత్రి, అదే పగలు. కానీ, కొంతమంది జీవితంలో సక్సెస్ అయితే, మరికొంతమంది మాత్రం లైఫ్‌ని భారంగా భరిస్తుంటారు. దీనికి కారణాలు.. లైఫ్‌ని మార్చేందుకు కొంతమంది కొన్ని రూల్స్ ఫాలో అయితే, మరికొంత మంది వారికి నచ్చింది చేసుకుంటూ పోతారు. అసలు జీవితంలో సక్సెస్ కావాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.**

**నేర్చుకోవడం..**
ఏదైనా విషయాన్ని నేర్చుకోవడాన్ని ఆపొద్దు. ప్రతిరోజూ ప్రపంచంలో కొత్త అప్‌డేట్స్ వస్తూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. కాబట్టి, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు, ట్రెండ్స్ నేర్చుకోవడం, తెలుసుకోవడం ముఖ్యం.

**నమ్మడం..**
మిమ్మల్ని, మీ సామర్థ్యాలని నమ్మాలి. మీపై మీకే నమ్మకం లేకపోతే మరెవరూ నమ్ముతారు. మీ గోల్స్ సాధించే వరకూ మీ సామర్థ్యాన్ని నమ్మి పనులు చేయండి.

**పోల్చుకోవడం..**
ప్రతి ఒక్కరి జీవితాలు వేర్వేరుగా ఉంటాయి. అందుకని, మనం ఇతరులతో పోల్చుకుని మన జీవితతాన్ని తక్కువ చేయొద్దు. మనకున్న టాలెంట్‌ని గుర్తించి వాటిని ఇంకా మెరుగ్గా చేసుకుని సక్సెస్ అయ్యేందుకు ఏం చేయాలో వాటిపై దృష్టిపెట్టాలి.

**కలల సాకారం కోసం..**
ప్రతి ఒక్కరి జీవితంలో చాలా కలలు ఉంటాయి. వాటిని సాకారం చేసుకోవాలంటే ముందుగా కనే కలలు ఎంత అసాధ్యమని అనిపించినా వాటిని వదులుకోవద్దు. కష్టపడి ఇష్టపడి వాటిని అచీవ్ చేసేందుకు కష్టపడుతూనే ఉండాలి. అల వదలకుండా ప్రయత్నిస్తే ఎప్పటికైనా ఆ కల సాకారమవుతుంది.

**క్రియేట్ చేయడం..**
మీరు ఏదైనా కొత్తవి క్రియేట్ చేయండి. అందరి దారిలో మీరు వెళ్ళకుండా మీకంటూ గుర్తింపు ఉండేలా ఏదైనా విషయాన్ని క్రియేట్ చేస్తే అదే మీ సక్సెస్‌కి కారణమవ్వొచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com